
# అదృష్టమా నీ అడ్రస్ ఏమిటి?

కప్పగంతుల మల్లికార్జునరావు



మంచివాళ్ళకే అన్ని కష్టాలు; అమాయకులకే అన్నిసమస్యలూ వస్తాయనటానికి అరుంధతి కథ వో తార్కాణం.

అరుంధతి చిన్నతనంనుంచి బుద్ధిమంతురాలిగా, అమాయకురాలిగా పేరు పొందింది. అపురూప సౌందర్యవతుల కోవకు చెందినది కాకపోయినా తీర్చి దిద్దిన అవయవాల పొందికలో చూడ ముచ్చటగా వుంటుంది. కుల మత రాజకీయ విభేదాలకు అతీతంగా ఆమె వూళ్లో అందరికీ తల్లోనాలికగా వుండేది. అలాగే వూళ్ళో చిన్నా పెద్దా అందరూ కూడా ఆమె అంటే యిష్టపడేవారు.

అరుంధతి తండ్రి అంతంతమాత్రపు కుటుంబీకి. ఆయన చెప్పించిన బళ్ళో చదువుకాకుండా అరుంధతి వూళ్ళో ఓ శాస్త్రులుగారిని మంచిచేసుకొని పంచ కావ్యాలు, పురాణాళ్లో కొన్ని భాగాలు వంటబట్టించుకొంది.

అంతవరకు నిర్విచారంగా, హాయిగా గడిచిపోయిన అరుంధతి జీవితం పెళ్ళీడు రావటంతో చీకు చింతలకు లోనయింది.

తండ్రి ఎన్ని సంబంధాలు చూచినా వొక్కటీ ముడిపడలేదు. కట్నాల గుర్రాలెక్కి దౌడులు తీస్తున్న మగ పిల్లల్ని ఆయన పట్టుకోలేకపోయాడు. విసుగేసి ఆడపిల్లనుకన్న దౌర్భాగ్యానికి అరుంధతిని తిట్టి సాధిస్తున్న సమయంలో వూరు కలుగచేసుకొంది. కట్నం డబ్బుకు తలా వో రాయి వేసేరు. అరుంధతితండ్రి వెతికీ వెతికి వో సంబంధం స్థిరపర్చుకొన్నాడు. 'కుండకుదురు' వున్న కుటుంబం కనుక కట్నంలో చాలాభాగం ముందే వాళ్ళచేతుల్లో పోసేడు.

పెళ్ళిరోజు రానేవచ్చింది. పీటలమీద కూర్చోవలసిన ముహూర్తమూ ఆసన్నమయింది. అయినా పెళ్ళికొడుకు జాడ లేదు. పెళ్ళివారు మాత్రం అంత క్రితం రాత్రే వచ్చి విడిదిచేసి సకల రాచ మర్యాదల్ని అడిగి చేయించుకొని అనుభవిస్తున్నారు.

పెళ్ళివారితో పెళ్ళికొడుకు రాలేదన్న వార్త విని వూళ్ళోవాళ్ళు ముక్కున వేలేసుకున్నారు. కొందరు పెద్దలు కలిగించుకొని పెళ్ళికొడుకు రాకవిషయం అతడి తండ్రితో ప్రస్తావించారు.

'అంత కంగారు పడ్తారేటండీ? పెళ్ళివాళ్ళం మేము వచ్చాంగా? పెళ్ళి కొడుకుతో అప్పుడే పనేముంది? ఆ వేళకి రాకపోడులే! మీకూ నాకూ అంటే పనుల్లేవు. వాడికి ఎన్ని పనులో?'

'యింతకీ అబ్బాయికి ఏం వుద్యోగం?'

'ఎత్తు భారం వుద్యోగం? ఏదయితే నేం? మీకూ నాకూ అర్థమయ్యేది కాదు. సరేనా? వాడి వుద్యోగంలో కాలం అతి ప్రధానమైనది. విలువయినది. నిముషం పోతే రూపాయి పోయినట్లే -'

అంత గొప్ప వుద్యోగం ఏమిటో తెల్సుకోలేక వూళ్ళోవాళ్లు తికమక పడ్డా ఆ రాత్రి అరుంధతిని అదృష్టవంతురాలి కిందనే జమకట్టేసేరు.

అయితే మర్నాడు ముహూర్తం వేళ దగ్గర పడ్తున్నా రాకపోయే సరికి అరుంధతి అదృష్టం అకస్మాత్తుగా దురదృష్టం కింద మారిపోయింది.

'పీటలమీదదాకా వచ్చిన పెళ్ళి యిలా ఆగిపోతే ఎంత అప్రదిష్ట ?'

'అదలా వుంచమ్మా ? పాపం! యిక దాన్ని చేసుకోటానికి ఎవరు ముందు కొస్తారని ?'

'వచ్చేరేలనుకో. కట్నంకూడాముందేం యిచ్చేసేదే? అది గంగపాలేగా? మళ్ళీ ఎక్కడినుంచి తేవటం?'

యిలా తలకొక విధంగా అని తన పైన జాలి చూపుతుంటే అరుంధతి భయ పడిపోయి భోరున ఏడ్చింది.

మంగళసూత్రధారణ సమయం సమీపిస్తుండగా పెళ్ళికొడుకు వచ్చాడన్న వార్తతో పందిరంతా మోగిపోయింది. విడిదిలో సందడి. పందిట్లో వేడివేడి నిట్టూర్పులు — ఆనందబాష్పాలు!

అప్పటిదాకా అనవసరంగా అనుభ వించిన దురదృష్టాన్ని విస్మరించి వూరంతా మళ్ళీ అరుంధతిని అదృష్టపు అందలాన్నెక్కించి వూరేగించారు.

పెళ్ళిపందిట్లో కూర్చున్నారన్నమాటే కాని అంతా యీ కథలే చెప్పుకొంటు న్నారు. పెళ్ళికొడుకు వుద్యోగం- గొప్ప తనం - అతను యిప్పుడు ఎలావచ్చాడు- ఏమెక్కి వచ్చాడు - వూహాగానాలు— చర్చలు....

అంతా యీ సందడిలో వుండగానే అరుంధతి మెళ్ళో మూడు ముళ్ళూ పడ్డాయి. అరుంధతి ఎవరికో భార్య అయ్యింది. అయితే ఆ ఎవర్నో ఆమె చూడలేదు. అసలే పిరికిది. దానికితోడు ఏడ్చి ఏడ్చి ఉన్న కళ్ళతో చూడలేక పోయింది.


పెళ్ళయి పెళ్ళికొడుకు విడిదికి వెళ్ళి పోయాక చాలామందికి పెళ్ళికొడుకును చూడలేదన్న స్పృహవచ్చింది. కొందరు అతడిని చూడటానికి విడిది కెళ్లారు.

'అలసిపోయి వున్నాడు కదూ? నిద్ర పోయాడు' అన్నారు.

'అయినా యిప్పుడు మునిగిపోయిందే ముంది? రేపు పొద్దున చూడొచ్చుగా?' అనుకొంటూ ఎవరిదోవన వారు పోయారు.

మర్నాటి రాత్రి శోభనం నిర్ణయించారు.

కానీ తెల్లవారేసరికి పెళ్ళికొడుకు




విడిదిలో లేడన్నవార్తతో పందిరంతా మళ్ళీ మోగిపోయింది. ఎక్కడికి పోయాడో, ఎందుకు పోయాడో చెప్పే నాధుడు లేడు. వెతుక్కు రావడానికి అతని మొహం సరిగ్గా చూచిన మనిషి ఆ వూళ్ళో లేడు.

'మీ వూరివాళ్ళేమిటండీ? గోరంత దాన్ని కొండంత చేస్తారు? అబ్బే! యిలాగైతే యీ వూరి సంబంధానికి అంగీకరించకే పోదును? పెళ్ళయి పోయిన పెళ్ళికొడుకు ఎటుపోతే వూరి వాళ్ళకేమిట్ట! శోభనం అంటారా? ఆ ఘడియకు వాడికి వీలైతే వస్తాడు. లేక పోతే యింకో రోజవుతుంది. మునిగి పోయిందేముంది? మీ సంబరాలే చూచు కొంటే ఎలా? వాడి సమస్యల్ని గురించి కూడా కాస్త ఆలోచించండి. ఎంత అవసరం కాకపోతే కొత్త పెళ్లాన్ని వది లేసి వెళ్తాడు? అయినా మా కోడలి విషయం మాదికాదూ? వూరందరికీ ఏమిట్ట యీ శ్రద్ధ?' మంచి చెడ్డ లడగొచ్చిన వూరిపెద్దల చెంపలు అలా వాయించి పంపాడు పెళ్ళికొడుకు తండ్రి.

ఆ రాత్రికి పెళ్ళికొడుకు రాలేదు.

'మా కోడల్ని మాతో పంపండి' అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి మర్నాటి పునయం బయలుదేరిపోతూ.

అరుంధతి తండ్రి వూరి పెద్దల్తో ఆలోచించాడు.

'అబ్బాయికి వసతి దొరికినప్పుడు చెప్పండి. ఆ కాస్త కార్యం యిక్కడే జరిపించి పిల్లను పంపుతాం' అన్నాడు.

అంతే. అటునుంచి కబురు రాలేదు. ఆ కాస్త కార్యం జరగనేలేదు. అంత డబ్బుపోసి చివరకు అరుంధతికి ఓ మంగళసూత్రం కొనిచ్చినట్లయింది.

ఊళ్ళోవాళ్ళే పనిగట్టుకొనివిచారణలు చేయగా అరుంధతి మొగుడి గురించి రకరకాల భోగట్టాలు తెలిసేయి.

అతడేదో పెద్ద అంతర్జాతీయదోపిడీ గ్యాంగులో సభ్యుడన్నారు. కాదు, నక్స లైట్లలో చేరిపోయి అడవుల్లో తిరుగు తున్నాడని కొందరన్నారు. మరికొందరు సన్యాసయిపోయి హిమాలయాలకు వెళ్లాడన్నారు. కొడుకు విషయం ఎత్తి తేనే చచ్చిపోయినట్లు భోరున ఏడవ సాగారు అతని తలితండ్రులు.

మొత్తంమీద అరుంధతికి మంగళ సూత్రం తప్ప పెళ్ళి తాలూకు ఒక్క మధురానుభూతి లేదు. పెళ్ళిరోజు తల్చు కోవాలంటేనే భయం. మొగుడి మొహ మన్నా చూచానుకాదే నన్న దిగులు!

అయినా ఆమె ప్రాచీన భారతీయ సంప్రదాయ స్త్రీ ధోరణిలో తన దురదృష్టాన్ని నిందించుకొంటూ, మొహమైనా తెలీని ఆ భర్త కోసం నిరీక్షిస్తూ, అతడికోసం పూజలు, పునస్కారాలు, దానధర్మాలు చేస్తూ పదేళ్ళు గడిపింది. ఆమె యవ్వనం అడవిగాచిన వెన్నెల్లా ప్రకాశించి ప్రకాశించి నేలలో, నీటిలో కల్సిపోతోంది.

యీ పదేళ్ళలో ఆమె గొప్ప పతివ్రతగా పేరుపొందింది. 'నిప్పు' అన్న బిరుదు సంపాదించుకొంది.

కానీ తలితండ్రులతోపాటు వూరి పెద్దలకికూడా ఆమె జీవితం అలా కావటం మనసులో వేధిస్తూనే వుంది. చేజారి ఎటో పోయిన దాంపత్యజీవితాన్ని ఎలాగూ తామివ్వలేరు. అంతకన్న మించిన ఖ్యాతిని దేన్నైనా ఆమెకిస్తే? ఆలోచించగా ఆలోచించగా ఆమెతోపాటు వూరికీ ఖ్యాతివచ్చే మార్గం ఒకటి తట్టింది వారికి.

ఆమెలో ఏవో అద్భుత శక్తులు ప్రవేశించినట్లు ప్రచారమయింది. ఆమె మహత్తుల్ని గురించి వూరూరా కథలు చెప్పుకోసాగారు. మనుష్యత్వంలోనుంచి వొక్కసారిగా ఆమె దైవత్వంలోకి నెట్టబడింది. 'అమ్మ' అయింది.

క్రమంగా ఆమెకు భక్తులు పెరిగారు. ఆమె ఎవ్వరితో మాట్లాడదు. ఆమె ఎదుట మౌనంగా వో అరగంట కూర్చుంటే ఏవో శక్తులు తమలో ప్రవేశించినట్లు, తమ వ్యాధులు నయమయినట్లు, కష్టాలు, బాధలు పోయినట్లు చాలా మంది చెప్పుకోసాగారు.

'అమ్మ'కు పేరొచ్చింది. 'అమ్మ' వున్న ఆ వూరుకు పేరొచ్చింది.

పక్కవూరివారికి యిది చూచి కన్ను కుట్టింది. ఆ మాటలు వింటూనే ఆవూరి పెద్ద మోతుబరి ఆసామి ఎక్కడినుంచో వో సన్యాసిని తీసుకొచ్చాడు. 'బాబా' అన్నారు.

ఆ బాబా మాటల్లో మహత్తర ఆకర్షణ వుంది. ఆ మాటలు వింటేనే చాలు ఎటువంటి దీర్ఘవ్యాధులూ పోతాయి. బాబా మీ మనసులో మాటల్ని వూహల్ని చదివి చెప్తాడు. మీ కోరికలు తీరేదీ లేనిదీ చెప్తాడు. అతనిది సిద్ధవాక్కు. చెప్పింది జరిగి తీరాల్సిందే.

బాబా ఎత్తుగా, పచ్చగా బాగుంటాడు. ఆయన వేసుకొనేవి కాషాయాంబరాలైనా అవి అతి ఖరీదైనవి కావటం చేత ఆయనను ప్రకాశింప చేస్తుంటాయి. ఎలుగుబంటి బొచ్చులా ఆయనకు మొహమంతా గడ్డాలూ మీసాలే అయినా అవి తీర్చిదిద్దినట్లు అందంగా వుంటాయి.

మొదట్లో మోతుబరి రైతు ఇంట్లోనే ఆయన మకాం. తర్వాత గుడికి మార్చేరు. బాగా ప్రచారం వచ్చి భక్తుల సంఖ్య పెరిగేక ఆయనకు అన్ని ఆధునిక వసతులతో కుటీరం కట్టించి యిచ్చారు వూరివాళ్ళు.

చిన్న పురుగును పెద్ద పురుగు తిన్నట్లు నోరులేని అమ్మ మహత్తు నోరున్న ఆ బాబా మహత్తు ముందు దిగదుడుపు అయిపోయింది. సూర్యుడి ముందు దివిటీలా కళావిహీనమయింది.

భక్తులను బాబా తపస్సు చేయమనడు. నియమ నిష్ఠలని, ఉపవాసాలని బాధలు పెట్టి చంపడు. పెళ్లాంపిల్లల్ని వదిలి విరాగులు కమ్మని కోరడు. డబ్బు ఖర్చయ్యే పనుల్ని ఏ ఒక్కదాన్నీ చేయమని నిర్బంధించడు.

భక్తి—భగవంతుడిపైన, తనమీద కలిగివుంటే చాలు. నమ్మి భగవంతుడి పేరిట తనకు సర్వస్వం అర్పిస్తే చాలు – అన్ని బాధలూ తీరతాయి. మోక్షప్రాప్తి కలుగుతుంది. పెళ్లి – ప్రేమలు – మమకారాలు – పిల్లలు – ధనార్జన – అంతా మామూలే!

ఏ కష్టం లేకుండా, కానీ ఖర్చు చేయకుండా స్వర్గానికి టిక్కెట్టిచ్చే బాబా ప్రజల్ని ఆకర్షించటంలో అబ్బురం ఏముంది?

బాబా భక్తుల్లో చాలా మంది ఒకప్పుడు 'అమ్మ' భక్తులే. కాంగ్రెస్ అధికారంలో నుంచి దిగి జనతాపార్టీ అధిష్ఠించగానే, కాంగ్రెస్‌వారంతా జనతావారుగా మారి పోయినట్లు, వారంతా అమ్మను వదిలేసి బాబా భక్తులయ్యారు. అయినా పాత వాసనలు పోయి కాంగ్రెస్‌లోని కమ్యూనిస్టుల్లా సందర్భం దొరికితే చాలు – అమ్మను గురించి మాట్లాడుకొనేవారు. అర్ధనిమీలిత నేత్రాలతో ధ్యానముద్రలో ఉండే బాబా అన్నీ వినేవాడు.

అలా బాబా అరుంధతి అందాన్ని గురించి విన్నాడు. ఆమె స్వభావం, మంచితనం – పెళ్లి – అమ్మ కావటం అన్నీ విన్నాడు.

అక్కడ అరుంధతి కూడా బాబా మహత్తుని వింది. తన భర్త ఆచూకీఅడిగి తెలుసుకోవాలని మహా ఉబలాటపడింది. 'అమ్మగా తన మహత్తులాంటిదే కాదు కదా బాబా మహత్తు కూడా?' అన్న ఆలోచన ఆమెకు రాకపోలేదు. కానీ ఆశ! ఏ పుట్టలో ఏ పాముందో? ఏ ఇంట్లో ఎంత నల్లధనముందో?

అరుంధతి కోరిక విని వూరి పెద్దలు అదిరిపోయారు. తమ వూరి 'అమ్మ' ఆ వూరి 'బాబా'ను దర్శించటమా?

అనాదిగా ఆ రెండు వూర్ల మధ్య పోటీ వుంది. ఆ పోటీ దృక్పథంవల్లే అమ్మకు పోటీగా బాబాను తీసుకొచ్చారు ఆ వూరివాళ్ళు. బాబాకు పేరు రావటంతో అసలే యీ ఊరివారికి అవమానంగా వుంది. దానికితోడు అరుంధతి బాబాను చూడటానికి వెళితే పూర్తిగా లొంగినట్లే కదూ?

యిక్కడ అరుంధతి బాబాను దర్శించాలన్న కోరికను వెలిబుచ్చిన రోజే, అదే క్షణాన అక్కడ బాబా ఊరిపెద్దల

ముందు అమ్మను గురించి ప్రస్తావించాడు. ఆమెను చూడాలన్న కోరికను వ్యక్తం చేశాడు.

భక్తులు ఆశ్చర్యపోయారు.

'దీనికి కారణం లేకపోలేదు. యిది భగవత్సంకల్పం. రాత్రి భగవంతుడు 'అమ్మ'ను చూడమని చెప్పేడు. హిమాలయాలలో తపస్సు చేసుకొంటుండగా నేను కోల్పోయిన నా గత జీవితం రాత్రినుంచి లీలామాత్రంగా స్ఫురణ కొస్తున్నది. ఆమెను చూచాక కాని నాకు స్పృహ పూర్తిగా రాదు. భగవంతుడి ఆజ్ఞ యొక్క పర్యవసానం పూర్తిగా బోధపడదు.'


యింకేం? ఆ వూరివారు యీ ఊరివారు రెండు వూళ్ళ మధ్య దారిలో కల్సుకున్నారు. విషయాలు తెల్సుకొని ఆశ్చర్యపోయారు! యిద్దరికీ ఒకేసారి ఒకర్నొకరు చూచుకోవాలన్న ఆలోచన రావటంలో ఆంతర్యం? ఖచ్చితంగా ఇది దైవసంకల్పమే! భగవత్ప్రేరణే!

అరుంధతే బాబాని చూడటానికి వచ్చింది. చూచింది. దైవభావం కలిగింది. నమస్కరించింది. తన కోరికను చెప్పబోతోంది.

'పైకి కన్పించే నాలోని దైవత్వం వెనుకనున్న 'నన్ను' గుర్తించలేదా అరుంధతీ.'

అరుంధతి వంతు ఆశ్చర్యపోతూ ఆయన్ని చూడటమే అయింది.

'నీవు నీ భర్త భోగట్టా అడగాలని వచ్చావు. కానీ ఎదురుగ్గావున్న నీ భర్తను నీవు గుర్తించలేకపోతున్నావు. నీ కళ్ళకు కమ్మిన మాయపొరను తొలిగిస్తాను. నాలోకి నేరుగా చూడు. మాయపొరను తొలిగించాక కూడా నువ్వు నాలో భగవంతుడినే చూస్తే యిద్దరం యిలాగే ఉండిపోదాం. నువ్వు అమ్మగా నేను బాబాగా ప్రజలకు ముక్తి ప్రసాదించి భగవంతుడిలో ఐక్యం




అవుదాం. కాక నువ్వు నాలో నీ భర్తను చూస్తే తిరిగి ఇరువురం పూర్తి లౌకిక జీవితాన్ని కలిగించుకోవల్సి వుంటుంది. దైవత్వాన్ని కోల్పోయి మామూలు మానవులుగా కాలం గడపాల్సి వస్తుంది. యిది దైవసంకల్పం—'

బాబా మాటల్ని అందరూ విన్నారు. అందరూ ఆయనవైపే చూస్తున్నారు. అందరికీ ఆయన ప్రసన్నవదనంలో భగవంతుడే కన్పిస్తున్నాడు.

అరుంధతి కూడా ఆయన్నే చూస్తోంది. ఆమెకు తన 'అమ్మత్వం' గుర్తుకొచ్చింది. బాబా వయసు, అందమైన విగ్రహం, ఆమె వయసు కోరికలతో కలబడ్డాయి. ఆమె మనసును జయించాయి.

ఆమె భర్తని క్షణమాత్రమన్నా ఎప్పుడూ చూడని మాట నిజమే. కానీ యిప్పుడు బాబాని చూస్తుంటే ఎన్నో జన్మలుగా తన భర్తను చూస్తున్నట్లే ఆమెకు అనిపించింది. అతడిని పెనవేసుకొని ఐక్యం అయిపోవాలన్న వాంఛ గుండెల్లో ఎగదన్నింది.

ఆమె అతని కాళ్ళమీద పడింది. వెక్కి వెక్కి ఏడుస్తూ కన్నీళ్ళతో అతని పాదాలని అభిషేకించింది.

'యిన్నాళ్ళకి దయగలిగిందా స్వామీ. ఎక్కడికి వెళ్ళేరు? ఏం చేశారు? నాకెందుకు విధించారీ శిక్ష?' అంటూ రోదించింది.

బాబా హుందాగా నవ్వేడు - భక్తులవైపు చూచి-

'శిక్ష విధించటానికి నేనెవర్ని? భగవంతుడే నీకూ నాకూ ఈ శిక్ష విధించాడు. పూర్వజన్మలోనూ మనం భార్యాభర్తలమే. ఆ జన్మలోని పాపశేష ఫలం యీ రూపంలో అనుభవించాం. జనానికి మోక్ష మార్గం చూపించి మనం ఆ పాపాన్ని ప్రక్షాళనం చేసుకొన్నాం. భగవద్వాణి మొన్నరాత్రి చెప్పేదాకా నాకూ ఇవేమీ తెలీదు.'

జనం సినిమా చూసినట్లు రెప్పవాల్చకుండా చూస్తున్నారు.

'భక్తులారా, అరుంధతి నన్ను, ఏనాడో కన్పించకుండా పోయిన తన భర్తగా గుర్తించింది. ఆమెను చూచిన క్షణంలోనే నాకు గత స్మృతులన్నీ వచ్చాయి. ఆమెను నా భార్యగా గుర్తించాను. అలా ఇరువురం పరస్పరం గుర్తించుకొన్న క్షణంలోనే-మా ఇరువురిలోని మహత్తులు మాయమయిపోయాయి. ఇప్పుడు నేను మీలాంటి సాధారణ మనిషిని. అరుంధతీ అంతే. మమ్మల్నేం చేయమంటారో మీరే సెలవియ్యండి.'

ఆ ఊరి పెద్దలు యీ ఊరి పెద్దలు

కత్తి చాలాసేపు బుర్రలు బద్దలుకొట్టుకొన్నారు. అనుమానాలు - సందేహాలు - ఆశ్చర్యాలు....ఎన్నో ఎన్నో వచ్చిపోయాక ఆఖరికి నిర్ణయించారు.

'అరుంధతిని ఏలుకోవాల్సిందే. ఆ రోజు పారిపోయిన అతడిని పట్టుకెళ్ళి యీ రోజు రాత్రి గర్భాదానం చేయాల్సిందే.'

అలా ఆ రోజు రాత్రి అరుంధతీ సుబ్బారావులు పెళ్లికూతురు పెళ్లికొడుకులయ్యారు. అరుంధతి తపస్సు ఫలించిందని అందరూ అనుకొన్నారు!

* * *

పుష్కర కాలంపాటు అనుభవించాల్సిన దాంపత్య సుఖాన్ని అరుంధతి సంవత్సరంన్నరలో అనుభవించింది.

సుబ్బారావుకు ఆమె అంటే అమిత ప్రేమ. ఆమెను వదిలి క్షణం వుండలేడు. అతడు చెప్పే అందమైన కబుర్లకు ఆమె చక్కటి శ్రోత!

అమ్మ తాలూకు ఛాయలు అరుంధతిలో కాని, బాబా తాలూకు ఛాయలు సుబ్బారావులో కాని మచ్చుకు కన్పించటం లేదిపుడు. జనం వాళ్ళని అలా మర్చేపోయారు.

అతను ప్రేమతో చేసే అల్లరి చూచి అరుంధతికే ఎపుడైనా అనిపించేది, 'ఇంత రసికుడు, ఇతనేం బాబా? ఇతనికి భగవంతుడు చెప్పటమేమిటి? గతస్మృతులేమిటి? హిమాలయాల్లో తపస్సేమిటి?' అని. కానీ అడగాలంటే భయం. 'నీ అమ్మ విషయం ఏమిటి? ఏ మహత్తులని పెట్టుకొని భక్తుల జబ్బులని కుదిరించావ్? బాధల్ని తీర్చేవ్!' అని ఎదురు తిరిగి నిలేస్తే? ఏం సమాధానం యివ్వటం!

అప్పటికీ ఓసారి అంది 'యింత ప్రేమ ఇన్నాళ్ళూ ఎక్కడ దాచారండీ? అకస్మాత్తుగా ఎలా పుట్టుకొచ్చింది?'

'ఎక్కడ దాచానా? ఇక్కడ - యీ గుండె పొరల్లో. నిన్ను చూడగానే పైకి లేచొచ్చి భరతనాట్యం చేస్తోంది. ఓ పిచ్చి అరుంధతీ - నిన్ను చూచాకే తెల్సుకున్నా. స్వర్గం-మోక్షం ఎక్కడో లేవు. స్త్రీ పురుష ప్రేమలోనే వుంది. ముక్కు మూసుకు తపస్సుచేయటం, కాషాయాంబరాలు కట్టి ఆశ్రమాలలో కూర్చోటం - స్వర్గానికి రహదారిని వదలి ముళ్ళదారిని పట్టటంలాంటిదని కూడా నిన్ను చూచాకే తెల్సుకున్నా -' అని ఓ పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు.

అరుంధతికి సుబ్బారావు తన భర్త కాదేమోనన్న అనుమానం ఎప్పుడూ రాలేదు. కానీ ఎన్నాళ్ళకీ తన యింటికి తీసుకెళ్ళడేం? కనీసం అత్తమామలైనా ఒక్కసారైనా రారేం?

'నీ అత్తమామలు ఎప్పుడో స్వర్గానికి టిక్కెట్టు పుచ్చుకొన్నారు. ఎప్పుడో లేచిపోయిన నేను ఇన్నాళ్ళకు వెళ్ళి ఏం మొహం పెట్టుకొని ఆస్తిలో వాటా అడగను? అయినా నాక్కావలసిన ఆస్తి నువ్వు. ఇంక వేరే ఆస్తులకోసం చింత ఎందుకుట నాకు?' వూళ్ళోవాళ్ళు అడిగినా ఆ ప్రశ్నకు ఇదే సమాధానం!

సుబ్బారావు అందర్తోపాటు మామూలుగానే పొలంలో కష్టపడి పని చేస్తాడు. దురభ్యాసాలేమీలేవు.

"ఆడపిల్ల పుట్టింట్లో, అల్లుడు అత్తవారింట్లో వుంటే గౌరవం ఉండదయ్యా. అల్లరికం తిన్నంతకాలం తిన్నావుగా? మీ వూరే వెళ్తావో మరో వూరే వెళ్తావో పెళ్లాన్ని తీసుకొని వేరే కాపురం పెట్టుకో. బాగుంటుంది."

సుబ్బారావు వేరే కాపురం పెట్టాలనుకొంటున్న సమయంలో అరుంధతి గర్భం దాల్చింది.

'యిప్పుడెక్కడికి తీసుకెళ్తావులే? ఏకంగా కొడుకు పుట్టేక వెళ్ళు' అని అత్తమామల్తోపాటు ఊరి పెద్దలూ అన్నారు.

అరుంధతి అన్ని పరీక్షల్లో గట్టెక్కి జీవితంలో స్థిరపడిపోబోతున్నదని అంతా సంతోషించే సమయంలో ఆమెకు మరో పెద్ద పరీక్ష వచ్చింది!

* * *

ఎక్కడనుంచి వచ్చాడో, ఓ రోజు చీకటిపడ్డాక ఓ గడ్డాల మనిషి ఆ ఊళ్లోకి దిగబడ్డాడు. ముందు అంతా అతడిని చూచి ఊరికి మరో బాబా దిగబడ్డాడనుకొన్నారు.

అరుంధతి, సుబ్బారావుల అమ్మ, బాబా కథల తర్వాత ఆ ప్రాంతంలో చాలామంది అమ్మలు, బాబాలు వెలవసాగేరు. అదో వృత్తిగా తయారయినట్లు కన్పిస్తోంది.

'ఎవరు స్వామీ తమరు? మా ఊరికి బాబాల అవసరం లేదు. నో వేకెన్సీ హియర్ -' అని అన్నాడెవరో యువకుడు ఎగతాళిగా.

గడ్డాల మనిషి అప్పుడు చెప్పేడు - తాను అరుంధతి మొగుడినని!

'అరుంధతి మొగుడా!!'

క్షణంలో యీ వార్త ఊరంతటికీ తెలిసింది. అప్పటికి గడ్డం మనిషి అరుంధతి ఇంటి ముందుకు చేరాడు.

సరిగ్గా ఆ సమయంలో అరుంధతి ఎవరో ముష్టివాడికి మాదాకవళం వేసి లోపలికి వెళ్ళబోతున్నది. 'గుమ్మడిపండు లాంటి కొడుకును కనుతల్లీ' అని ఆశీర్వదించి ముష్టివాడు పోతున్నాడు.

లోపలికి పోతూ అరుంధతి గడ్డం మనిషిని చూచింది. మరో ముష్టివాడు అనుకొంది. 'వుండబ్బీ. నీకూ ఓ కవళం తెచ్చి వేస్తా' అని అతడు అడక్కుండానే అంది.

'కవళం కాదు. నిన్ను తీసుకుపోవటానికే వచ్చా.'

అరుంధతి, మాయలమరాటీని చూచినట్లు ఒణికిపోయింది. కాళ్ళ

వణుకుతుండగా, గుండెలు కొట్టుకొం టుండగా లోపలి కెళ్లింది.

క్షణంలో జనం గడ్డం మనిషిని ముట్టడించారు. సుబ్బారావు యింకా పొలంనుంచి రాలేదు. అతడి కెవరో ఈ కబురు మోసేరు.

ఎవరెంత రెట్టించినా, భయపెట్టినా, బెదిరించినా గడ్డంమనిషి – తాను అరుంధతి మొగుడినన్న మంత్రాన్ని మాత్రం వదల్లేదు. పైగా పెళ్ళినాటి సంఘటనలన్నీ పూసగుచ్చినట్లు చెప్పేడు. తన తండ్రిని, తల్లిని వర్ణించేడు.

'అసలప్పుడు నాకు పెళ్ళి యిష్టం లేదండీ. నే నో మిషన్ మీద ఉన్నాను. మా నాన్న అన్నీ తెల్సి కట్నంకోసం ఆ నాటకం నడిపించాడు.'

'అయితే యిన్నాళ్ళకు కావాల్సి వచ్చిందా పెళ్లాం? ముక్కూ- మొహం తెలియని నిన్ను జపంచేస్తూ యిన్నాళ్ళూ కూర్చోవాలనే నీ ఉద్దేశ్యం?' ఎవడో యువకుడు ఉద్రేకంగా అడిగాడు.

'మరి మెళ్ళో తాళి కట్టించుకున్నాక ఆడది ఏం చేస్తుందండీ?'

'ఏంచేస్తుందా? మరోడితో కాపురం చేస్తుంది.'

'నా భార్య అలాంటి దెన్నటికీ కాదు.'


'ఛా! సిగ్గులేదూ, అలా అనటానికి!'

'అబ్బ! ఎన్నడూ చూడని పెళ్లాం పైన ఎంత విశ్వాసం?'

'మాటలేందిరా ఆ దొంగవెధవతోటి? కాపురం చేసుకొంటున్న ఆడదానికి భర్తనంటూ వచ్చాడు. కొట్టండి వెధవని.'

నలుగురూ నాలుగు చేతులేసి అతడిని పచ్చడి చేసేవారే. కానీ ఇంతలో అతని పాలిటి దేవుడిలా సుబ్బారావు వచ్చాడు. అందర్నీ శాంతింపచేసి అరుంధతి దగ్గరి కెళ్లాడు.

'అతడు దొంగ. నా పెళ్లాంతో అక్రమంగా కాపురంచేస్తున్న గజదొంగ.'




సుబ్బారావు లోపలి కెళుతుంటే గడ్డం అతను బిగ్గరగా అరిచేడు.

సుబ్బారావు చూడగానే అరుంధతి ఏడుస్తూ వెళ్ళి మెడ వాటేసుకొని అతని గుండెలమీద వాలింది.

'ఏమండీ? ఏమిటి నా కీ పరీక్ష?'

అతడామెను ఊరడించాడు. ధైర్యం చెప్పేడు. కన్నీరు తుడిచేడు.

'నేను బాగా చదువుకొన్నాను అరుంధతీ. బీదవాడిని. వక్తృత్వం, నాటకాలు యిత్యాది ఎన్నో రంగాలలో ఎన్నో బహుమతులు సంపాదించాను. కానీ యివేవీ నా కుద్యోగం ఇప్పించలేక పోయాయి. ఆకలిని తీర్చలేకపోయాయి. విసిగేసి పెట్టుబడిలేని బిజినెస్సును ఆలోచించాను. బాబా నయ్యాను. నా విజ్ఞానంతో, నాటకాల అనుభవంతో జనాన్ని సులభంగానే నమ్మించి మోస గించగలిగేను. కానీ అంతరాత్మ వుందే – దాన్ని మోసగించలేకపోయాను. అను క్షణం అది నన్ను తంతూనే వుంది.


"ఆ సమయంలో నీ కథ విన్నాను. నీ భర్తచనిపోయి వుంటాడనుకొన్నాను. నువ్వు ఛాందసురాలివి. అమాయకు రాలివి. భర్త వుండగా మరొకరిని పెళ్ళి చేసుకోకూడదనుకొనే పతివ్రతవి. నీ మీద ప్రేమ- జాలి- నిన్ను ఉద్ధరించి నన్ను ఉద్ధరించుకోవాలన్న తపన.... మరొక నాటకం రాసేను. ప్రదర్శించేను. బహిరంగంగానే నీచేత నేను నీ భర్తనని చెప్పించాను. నీతో కాపురం చేయమని అందరిచేత బ్రతిమిలాడించుకొన్నాను. నీకు భర్తనయ్యాను.

"అంతవరకూ మోసమే, నాటకమే. కానీ ఆ తర్వాత ఏనాడూ నీకు అన్యాయాన్ని, మోసాన్ని తలపెట్టలేదు. నీపట్ల రోజురోజుకీ ప్రేమ పెరిగిందే కాని తరగ లేదు. నీకోసం నా చదువును, కులాన్ని వంశాన్ని మర్చిపోయాను.

"నేను చేసింది తప్పో, ఒప్పో నేను ఇప్పుడు చెప్పలేను. కాని నేనేది చేసినా దురుద్దేశ్యంతో చేయలేదు. బాబా వేషాన్ని పరిస్థితులకి తలవొగ్గి వేసేను. నీ భర్త వేషాన్ని నీ మీద ప్రేమతో, నీకు జరిగిన అన్యాయానికి జాలితో వేశాను.

"అతనవునో కాదో నేను చెప్పలేను. నేనుమాత్రం నీకు తాళికట్టిన భర్తను కాను. మనసిచ్చిన మనిషిని.

"ఇది కల్పన ఏమాత్రం లేని వాస్తవ కథ. ఈ కథకు ముగింపు నా చేతిలో లేదు. ఎవరి చేతిలోనూలేదు, నీ చేతిలోనే




వుంది. ఆలోచించి ఏ ముగింపు ఇస్తావో ఇయ్యి."

ఆమె అతడినే చూస్తోంది. ఆ చూపులో భయం, ప్రేమ, వాంఛ ఏమీ లేవు. నిర్వికారంగా, నిరామయంగా ఉందామె చూపు."

అతడామె చూపుల్ని భరించలేక వాకిట్లో కెళుతుంటే ఆమె వారించలేదు! మాట్లాడలేదు.

"నా పెళ్ళానికి ఎవరు దొంగభర్తో రేపు తెల్లారేక తెలుస్తుందిగా? నన్నంటే మీ ఊళ్ళోవాళ్ళు చూచివుండరుకాని, మా నాన్నని, అమ్మని చూసారుగా? వాళ్ళని పిలుచుకొచ్చి ఆ దొంగభర్త రంగు బయటపెట్టనూ? వాడి దుమ్ము దులిపేయనూ?" ఆవేశంగా అంటున్నాడు గడ్డాల మనిషి.

"అరుంధతి అత్తగారూ,మామగారూ చనిపోలేదూ? సుబ్బారావు అలా చెప్పాడేం?"

"అలా చెప్పక ఎలా చెప్తాడు? నిజం చెప్తే అసలురంగు బయటపడదూ?"

జనం సుబ్బారావును నిజం చెప్పమని నిలవేయకముందే అతనే చెప్పేడు. జనం ముందు రెచ్చిపోయినా తర్వాత వాళ్ళ ముందో పెద్ద ప్రశ్న భూతంలా నిలబడింది.

తాళికట్టిన భర్తవొకడు, కాపురం చేసి కడుపుచేసినవాడు వేరొకడు.

ఇద్దర్లో ఎవరు భర్త? ఏ ధర్మశాస్త్రం ఈ ప్రశ్నకు సమాధానం ఇస్తుంది? తీగ లాక్కుంటూపోతే డొంకేకాదు ఊరి పరువంతా కదిలిపోతోందన్న భయమేసిన ఓ పెద్దమనిషి అన్నాడు గడ్డాలమనిషితో

'జరిగిందేదో జరిగిపోయిందయ్యా. పధ్నాలుగేళ్ళు పెళ్ళాన్ని వదిలేసి మాయమయిపోయి యివాళ మొగుడినని రావటం నీకుమాత్రం ధర్మమా? ఏదో ఆశపడి వచ్చావనుకొందాం. కానీ యిక్కడ నీ పెళ్ళాం మరోడితో కాపురంచేసి బిడ్డను కనబోతోంది. ఎంగిలికూడుకు ఎందుకు ఆశపడ్తావ్? రచ్చచేయక నీ దారి నీవు చూచుకోరాదూ?"

"అంటే....నా పెళ్ళాన్ని వాడెవడో అక్రమంగా అనుభవించడంచూచి దాన్ని వాడికి కట్టబెట్టి పొమ్మనమనా మీ ఉద్దేశం. నా పెళ్ళానికి నేను చేసిన ద్రోహానికి నాకన్నా దుఃఖించేవాళ్ళు ఎవరుంటారు? తాళికట్టిన బంధాన్ని భార్యచేసిన స్వల్ప ద్రోహానికి, అదీ ఎరక్క - తెంచుకుపోతాననుకుంటున్నారా? లేదు నేనంత కుత్సితుడనుకాదు. యిందులో నా దోషం కూడా వుంది కనుక నా భార్యకు పుట్టే బిడ్డకు నేనే తండ్రినవుతాను. ఇన్నాళ్ళు ఆమె తెలియకచేసిన నేరాన్ని క్షమిస్తాను. ముందా అప్రాచ్యుడిని తన్ని తరిమేయండి.

గడ్డం మనిషి ఒక్కక్షణంలో ఉదాత్త నాయకుడయ్యాడు. అతని ఔదార్యాన్ని, త్యాగగుణాన్ని జనంపొగుడుకోసాగేరు. సుబ్బారావు అదేసమయంలో విలన్ కింద మారిపోయాడు జనం దృష్టిలో. అతడిని నానా విధాలుగా తిట్టుకోసాగారు.

'నాలుగు పుతికేవాళ్ళులేక, ఏమొహం పెట్టుకొని యింకా నిలబడ్డాడో చూడండి. పూర్వజన్మలో కూడా అరుంధతి మొగుడినన్నాడు వెధవ!'


'అట్టాకాదులే. అమ్మ పెట్టే నాలుగు చివాట్లకోసం ఎదురు చూస్తున్నట్లుంది. అరుంధతి నోరులేని పిల్ల కనుక బతికిపోయాడు.అదే యింకొకతయితే చీల్చి పారేయకపోయిందా దొంగ వెధవని!"

అరుంధతి రాకతో వూరిమూకలో కల్లోలం సద్దుమణిగింది. అందరిదృష్టీ ఆమెపై కేంద్రీకృతమయింది.

ఆమె మొహంలో విచారంలేదు. కళ్ళలో దైన్యత్వం లేదు. ధైర్యం, నిర్ణయం కన్పిస్తున్నాయి. ఆమె ఊరివారికి కొత్త అరుంధతి!

"జరిగిందేదో జరిగిపోయిందమ్మాయ్. విచారించి ఏంలాభం ఇప్పుడు? యిక జరగవలసింది చూడు. నీ మొగుడు నీకు జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దుతానంటున్నాడు. నీబిడ్డకు తండ్రినవుతానంటున్నాడు!"

అరుంధతి మాట్లాడలేదు. నేరుగా



సుబ్బారావు దగ్గిరకెళ్ళి అతని చేతులు పట్టుకుంది.

'నా మొగుడు, నా బిడ్డకు తండ్రి యిక్కడే వున్నారు బాబాయ్. నాకు ఎవరి దయాభిక్ష అక్కర్లేదు."

భూకంపం వచ్చినట్లు భయపడ్డారు జనం!

తెలియక జరిగిందేదో జరిగింది. యిపుడు అంతా తెల్సాక తాళికట్టిన భర్త ఎదుట పరపురుషుడిని భర్త అంటుందా?

"కానీ అమ్మాయ్. తను నీ భర్త కానని అతనే చెపుతున్నాడు. నీ భర్త నీ ఎదుటే ఉన్నాడు.''

'భర్త! ఏ ధర్మశాస్త్రం ప్రకారం? రెండేళ్ళు ప్రేమని, ఆనందాన్ని ఇచ్చిన ఈయన నా భర్త కాకపోయాడూ! మంగళసూత్రం కట్టటానికిముందే లంచం పుచ్చుకొని, అది తీసుకొని చెప్పాపెట్టా కుండా పారిపోయిన ఆ పెద్దమనిషి నాకు భర్త అయ్యాడూ? మంగళసూత్రం వెల అన్ని వేలరూపాయలా? మా డబ్బు మాకు వడ్డీతోసహా చెల్లించి మంగళ సూత్రం పట్టుకుపొమ్మనిమీరంతాఇన్నాళ్ళ కొచ్చిన అతడి నెందుకు నిలెయ్యరు? అతడిని డబ్బిచ్చి కొన్నది నేను. నాకు అతడిమీద అధికారం వుంది కాని నా మీద అతడికేం అధికారం వుంటుంది? ఐనా నా అధికారాన్ని యిచ్ఛాపూర్వకంగా వదులుకొంటున్నా. డబ్బు తిరిగి చెల్లించ కుండానే అతడు కట్టిన మంగళసూత్రాన్ని తిరిగి యిచ్చివేస్తున్నా. తీసుకొని వెళ్ళి పొమ్మనండి—' మంగళసూత్రం తీసి అక్కడ నేలమీదపెట్టి వెళ్ళిపోతున్న అరుంధతి అలనాటి సీత, దమయంతి యిత్యాది పతివ్రతలకు కార్బన్ కాపీగా కన్పించలేదు. యిన్నిమాటలు, యిన్ని ఊహలూ అరుంధతేనా మాట్లాడింది?

ఆ తర్వాత కథ ఎన్ని మలుపులు తిరిగేదో? తెలుగు సినిమాలా ఎంత గంద్రగోళంగా మారేదో? ఐతే అచ్చం సినిమాలోలా పోలీసులు ఎక్కడినుంచో వూడిపడ్డారు.

'నేనునక్సలైట్ని. నన్నురక్షించండి' అని ప్రాధేయపడ్డాడతను.

అతను నక్సలైటో కాదో తేల్చుకొనే లోగానే పోలీసులొచ్చి 'యితడు జైలు నుంచి తప్పించుకుపారిపోయొచ్చిన ఖైదీ' అంటూ పట్టుకుపోయారు.

'ఎన్ని కష్టాలొచ్చినా అరుంధతి మొత్తానికి అదృష్టవంతురాలే' అని వూరి జనం మరోసారి అనుకొన్నారు.

'కాకపోతే మన అరుంధతి ఏమిటి? మొగుడి మొహాన తాళిబొట్టు విసిరికొట్టి అన్నన్ని మాటలనడమేమిటి? నేనప్పుడే అనుకొన్నా, ఏ దైవశక్తో దానిచేతఅలా అనిపిస్తోందని. పోనీలే అమాయకురాలు యికనైనా సుఖపడ్తే మనకు అదే కావల్సింది.'

నిజమే. అరుంధతి అదృష్టవంతురాలే!

కానీ ఆ అదృష్టం ఖరీదు—ఆమెలో వచ్చిన భావవిప్లవం!

దాన్ని ఎంతమంది గుర్తించారన్నది మాత్రం కోటిరూపాయల ప్రశ్నే!

———